# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు శాంతి కాంక్ష- పాఠ్యాంశ కీలక భావన

సమాజంలో ఆవేశకావేశాలు రెచ్చగొట్టే దృశ్యాలే కనిపిస్తున్నాయి. ప్రసార మాధ్యమాల్లో సహనం, ఓర్పు, క్షమ వంటి సానుకూల అంశాలకు చోటు తక్కువగా ఉంది. అందువల్ల విద్యార్థులకు శాంతి గొప్పదనాన్ని తెలియజెప్పడం కోసం శాంతి కాంక్ష పాఠం పెట్టారు.

దుర్మార్గులను కూడా సన్మార్గంలోకి మళ్ళించే ప్రయత్నం చేయాలి అనేది ఈ పాఠంలోని కీలక అంశాలలో ఒకటి. చావు దేనికి పరిష్కారం కాదు. పోరాటం ఒక్కటే అన్ని సమస్యలను పరిష్కరిస్తుంది అనుకోవడం పొరపాటు అని ఈ పాఠం బోధిస్తుంది.

వ్యక్తులు శాంతిగా బతకాలి అంటే ఎవరితోనూ పగలు పెంచుకోకూడదు. సాధారణ వ్యక్తుల మాటలు అలా ఉంచితే కీలక స్థానాలలో ఉన్న వ్యక్తులు సంయమనాన్ని పాటించాలి. అప్పుడే దేశం సుభిక్షంగా ఉంటుంది. పగతో రగిలిపోయి ప్రజల ప్రాణాలు తీసే వారికన్నా సహనంతో ఉండి శాంతిని పరివ్యాప్తం చేసిన వారే యుగపురుషులుగా మిగిలిపోతారు అనే సత్యాన్ని ఈ పాఠం తెలియజేస్తోంది. ఎవరితో ఎలా మాట్లాడాలి అనే విషయాన్ని కూడా ఈ పాఠం ద్వారా నేర్చుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా భాషల మనుగడ ప్రశ్నార్థకమవుతోంది. రోజుకు కొన్ని పదుల సంఖ్యలో భాషలు అంతరించిపోతున్నాయి. మాతృభాష మీద వ్యామోహం తగ్గిపోయి పరాయి భాషపై అభిమానం పెరుగుతోంది.

ఈ పరిస్థితి మారాలంటే భావితరాలకు మాతృభాషపై అభిమానం పెరగాలి. ఈ ఉద్దేశంతో పెట్టిందే స్వభాష అనే పాఠం. భాష గురించి చాలా మందికి ఉన్న అపోహలను ఈ పాఠం తొలగిస్తుంది. ఉదాహరణకు ఇతర భాషలలో పదములకు అర్థం తెలిసినంతమాత్రాన ఆ భాష వచ్చు అనుకోవడం పొరపాటు.

భాషలో ఉన్న కళను, ప్రాణాన్ని, తత్వాన్ని, ఆత్మను పట్టుకోవాలి. అది మాతృభాషలో మాత్రమే సాధ్యమవుతుంది. జీవిక కోసం అన్య భాషలు నేర్చుకోవచ్చు. కానీ హృదయగత భాషలను చెప్పడానికి మాతృభాష మాత్రమే అర్హమైనది అవుతుంది. ఈ విషయాన్ని అందరూ గమనించాలి. ఇతర భాషల వ్యామోహంలో పడి మాతృభాషను మర్చిపోతే అనేక రకాల నష్టాలు ఎదురవుతాయి. కాలక్రమేణా మన సంస్కృతి, నాగరికత, ఆచారాలు, సంప్రదాయాలు అన్నిటికీ మనం దూరమైపోతాం అనే విషయాన్ని గమనించాలి అని పాఠం బోధిస్తుంది.

భారతజాతి ఔన్నత్యాన్ని హిందు మతం గొప్పదనాన్ని సార్వజనీనత్వాన్ని సార్వకాలికత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద. భారతీయధర్మం అన్ని మతాలను అంగీకరిస్తుందని, గౌరవిస్తుందని, అన్ని మతాలు సత్యాలేఅని, అవన్నీ భగంతుని చేరుకోవడానికి మార్గాలని స్వామీజీ చెప్పారు. 1863 జనవరి 12 వ తేదిన భువనేశ్వరీదేవి, విశ్వనాథ్ దత్తలకు జన్మించిన వివేకానంద బాల్యం నుంచి ధైర్యసాహసాలు ప్రదర్శిస్తుండేవారు. వివేకానంద చిన్నప్పటి పేరు నరేన్. పాఠశాలలో ఆటల మైదానంలో నరేన్ ప్రదర్శించే చురుకుదనం అందర్నీ ఆశ్చర్యపరిచేది. బాల్యంలోనే ఆయన జ్ఞాపకశక్తి అమోఘంగా ఉండేది. కళాశాల స్థాయిలో కూడా నరేన్ ప్రదర్శించిన తెలివితేటలు అనుపమానంగా ఉండేవి.

పాతికేళ్ళ తన అనుభవంలో ఈ దేశంలోకాని, పరాయిదేశంలో కాని నరేన్‌కు ఉన్న ప్రతిభను తాను ఎక్కడా చూడలేదని స్కాటిష్ చర్చి కాలేజి ప్రిన్సిపాల్ హేస్టీ అనేవారు. 1884లో బి.ఏ. పట్టా పుచ్చుకున్న నరేన్ ప్రతి విషయాన్ని కూలంకషంగా అవగాహన చేసుకునేవారు. రాను రాను ఆయన దృష్టి ఆధ్యాత్మికత వైపు మళ్ళింది. అదే ఆయనను శ్రీ రామకృష్ణులను కలిసేలా చేసింది. "మీరు భగవంతుణ్ణి చూశారా?" అన్న వివేకానంద ప్రశ్నకు రామకృష్ణ పరమహంస ధైర్యంతో నమ్మకంతో ఇచ్చిన సమాధానం వివేకానందకు ఆశ్చర్యం కలిగించింది. దైవ అస్తిత్వం పట్ల నమ్మకం పెంచింది. గట్టిగా నాలుగు దశాబ్దాలు కూడా జీవించని వివేకానంద భౌతిక జీవితం కష్టాలమయం. 1884 లో తండ్రిని కోల్పోవడం, 1885 లో తాను నమ్మిన గురువు శ్రీరామకృష్ణ పరమహంస గారికి గొంతులో క్యాన్సర్ రావడం వెంటనే జరిగాయి. ఈ సమయంలోనే నరేన్ సన్యాసాన్ని స్వీకరించి దేశ పర్యటన మొదలు పెట్టారు. చాలా సందర్భాల్లో బడలికలే ఆయనకు స్నేహితులుగాఉండేవి. అలా పర్యటిస్తూ తమిళనాడులోని కన్యాకుమారి దగ్గరకు చేరుకుని సముద్రంలో ఉన్న ఒక శిలవద్దకు చేరుకున్నారు. అక్కడ ధ్యాన నిమగ్నులయ్యారు. ఆ తర్వాత అమెరికాలో సకలమత మహాసభ జరగబోతోందని తెలుసుకొని దాంట్లో పాల్గొనాలి అనుకున్నారు. హిందూమత వైభవాన్ని చాటి చెప్పడానికి ఇదే సరైన వేదిక అని భావించారు. ఖేత్రీ మహారాజు సహాయ సహకారాలతో విదేశీ పర్యటన మొదలుపెట్టి "వివేకానంద" అనే నామధేయాన్ని స్వీకరించారు. అనేక నాటకీయ పరిణామాల మధ్య చికాగో చేరుకొని 1893 సెప్టెంబర్ 11వ తారీఖున నాలుగు వేలమంది ప్రతినిధుల సమక్షంలో "నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా!" అని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రాత్రికి రాత్రే స్వామీజీ ఖ్యాతి ప్రపంచవ్యాప్తంగా మారుమోగిపోయింది. కొన్నాళ్ళ తర్వాత భారతదేశం తిరిగివచ్చారు. భారతీయులకు తమ శక్తి సామర్థ్యాలు పూర్వ వైభవము గుర్తుచేశారు. అందరూ చదువుకోవాలి, స్త్రీలను గౌరవించాలి, పేదలకు సేవచేయాలి, దేశసేవలో పాలుపంచుకోవాలి వంటి సందేశాలు ఆయన ప్రసంగాల్లో ఉండేవి. అందరు ప్రేమ, నిజాయితీ, సహనం అలవాటు చేసుకోవాలి. యవత తలుచుకుంటే సాధించలేనిది ఏమీలేదని నమ్మకంతో చెప్పేవారు. "ఉత్తిష్ఠత జాగ్రత ప్రార్య వరాన్ నిబోధత- లేవండీ! మేల్కొనండీ! శ్రేష్టులైన ఆచార్యుల బోధనలను అనుసరించండి " అనేవారు ఆయన. "గమ్యం చేరేవరకు విశ్రమించకండి" అని పిలుపునిచ్చిన వివేకానంద 1902లో జులై 4 వ తారీఖున భౌతికంగా మనకు దూరమైనా ప్రాత :స్మరణీయులుగా మన అందరి హృదయాలలో చిరకాలం జీవించే ఉంటారు.

# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు శివతాండవం పాఠ్యాంశ కీలక భావన

పుట్టపర్తి నారాయణాచార్యులు వ్రాసిన శివతాండవం గేయం సంగీత సాహిత్యాల మేలు కలయిక. లయాత్మకంగా ఉన్న గేయాన్ని విద్యార్థికి పరిచయం చేయడం, వారిలో ఊహాశక్తిని పెంపొందింపచేయడం, భాషాభిరుచిని, సృజనాత్మకతను, ప్రకృతి ఆరాధన పట్ల అభిరుచి కలిగించడం ఈ పాఠ్యం ఉద్దేశం.

...తనం. అది ప్రకృతికి ప్రతిబింబం. ప్రకృతి వ్యక్తి భావన బలాన్ని బట్టి దర్శనమిస్తూ
...ఒకే సమయంలో వెన్నెల కొంతమందికి ఆనందాన్ని మరి కొంతమందికి
...తులను బట్టి ఇస్తూ ఉంటుంది. అలాగే లోకంలో ఉన్న సత్యం ఒకటి కాని
...లుగా మనకు కనిపిస్తూ ఉంటుంది. ఇలాంటి తాత్విక భావాలు అనేకం

సత్వరజస్తమో గుణాల సమ...
ఉంటుంది. ఉదాహరణకు
విషాదాన్ని, వారి వారి పరి...
పరిస్థితులను బట్టి రకరకా...
ఈ గేయంలో ఉన్నాయి.

# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు ప్రేరణ పాఠ్యాంశ కీలక భావన

ఒక వ్యక్తి ఉన్నతుడుగా ఎదగాలంటే సామాజిక, కుటుంబ పరిస్థితులు అవరోధంగా నిలుస్తాయి అనేది పాక్షిక సత్యమే. మనిషికి పట్టుదల ఉంటే ఎన్ని అవరోధాలు ఉన్నా విజయ శిఖరాలను అందుకోవచ్చని ఈ పాఠం చెబుతుంది.

మన అపజయాలకు కారణాలు సమాజంలో వెతుక్కోవడం అవివేకం అని పాఠం బోధిస్తుంది. సామాన్య కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం రాష్ట్రపతి స్థాయికి ఎలా ఎదిగాడు అన్న విషయాన్ని సంగ్రహంగా పరిచయం చేస్తుంది ఈ పాఠం. విద్యార్థి మంచివాడైతే చెడ్డ ఉపాధ్యాయుడి నుంచి కూడా చాలా నేర్చుకోవచ్చని ఈ పాఠం బోధిస్తుంది.

అన్నిటికన్నా ముఖ్యమైనది మనమీద మనకు నమ్మకం. ఆ తర్వాత లక్ష్యం మీద ప్రగాఢమైన కోరిక. అది జరిగి తీరుతుందని ఆశ, ఇవి చాలు విజయ శిఖరాలు అందుకోవడానికి. అలాగే అనుకూలమైన ఒత్తిడి విజయం పొందడానికి అవసరం అని కూడా ఈ పాఠం చెబుతుంది. క్రమశిక్షణ, నేర్చుకునే అంశం పట్ల నిబద్ధత ఉంటే జీవితంలో విజయం దానంతట అదిగానే వచ్చి తీరుతుందని కలాం జీవితం నిరూపిస్తుంది. అలాగే పుట్టగానే మేధావిగా ఉండకపోయినా క్రమశిక్షణ, పట్టుదల వదలకుండా ఉంటే కాలక్రమంలో మేధావిగా ఎదగవచ్చని తెలుస్తుంది. లక్ష్యం మీద కన్నా దాని ఫలితాలపై ఎక్కువగా ఆలోచిస్తూ జీవితాన్ని అర్థం చేసుకునేవారికి కలాం జీవితం ఓ ప్రేరణగా నిలుస్తుంది.

మరాఠీలో సుష్మా దేశ్పాండే వ్రాసిన ఈ గ్రంథాన్ని తెలుగులో ఓల్గా అనువదించారు. ఆంధ్రదేశంలో 1990 ప్రాంతం నుంచీ స్త్రీవాదం మొదలు అయిందని విమర్శకులు చెప్తుంటారు. స్త్రీవాదం ముఖ్య లక్ష్యం స్త్రీల అణచివేత స్వరూపాన్ని స్త్రీ పురుషులిద్దరూ సమగ్రంగా అవగాహన చేసుకొని దానికి భిన్నంగా జీవించడానికి ప్రయత్నించడమే ఈ ఉపవాచక పాఠం ముఖ్య ఉద్దేశం.

మహారాష్ట్రలో రకరకాల అణచివేతలపై పోరాటాలు ఎప్పటినుంచో మొదలయ్యాయి. జ్యోతిరావు పూలే, సావిత్రీ బాయి పూలే ఇరువురును పోరాటాలలో అగ్రభాగాన నిలిచారు. ఒకప్పుడు జీవితమే పోరాటంగా గడిపిన సావిత్రిబాయి పూలే ప్రస్తుత పరిస్థితులను చూస్తే ఎలా స్పందిస్తారు అన్న ఆలోచనకు అక్షర రూపం ఈ ఏడు పేజీల వ్యాసం. ఒకప్పుడు హక్కులకోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని జాతి ఇప్పుడు నిస్తేజంగా ఉండటం చూసి సావిత్రీబాయి ఆశ్చర్యపోతుంది. అందుకే తన జీవితాన్ని గురించి చెప్పి నేటి తరానికి పునరుత్తేజాన్ని కలిగించాలని ప్రయత్నించింది.

ఇందులో ఆమె బాల్యం ఎలా గడిచిందో వివరించింది. లక్ష్మణరేఖ గురించి ఎన్నో వందలసార్లు ఆమె తల్లిదండ్రులు చెప్పారు అని చెప్పడం ద్వారా ఆడది గడప దాటి బయటకు పోకూడదు, మగవాడి మాట అతిక్రమించకూడదు అన్న అలోచన అప్పటి తరాల్లో ఎంత గాఢంగా ఉండేదో వివరించారు. అభ్యుదయ భావాలు కలిగిన సేఠ్‌జీతో తనకు వివాహం జరగటం అదృష్టమే అని భావించింది. భర్త తన ఆలోచనా దృక్పథాన్ని ఎలా మార్చాడో ఇందులో వివరించారు ఈమె.

జ్యోతిరావు పూలే తండ్రి మాత్రం ఈ మార్పులను సహించలేకపోయేవారు. కొడుకు అతని భార్యకు చదువు చెప్పడం, విద్యావంతురాలిని చేయడం, ఆయనకు ఏమీ నచ్చలేదు. అందుకే ఆడదానికి చదువు పనికిరాదు, చదువుకున్న ఆడది చెడిపోతుంది, బుద్ధిలేనిది అవుతుంది అని స్పష్టంగా తన అభిప్రాయం చెప్పాడు. కుల, మత, వర్గ, వర్ణ, లింగ పోరాటాలు విడివిడిగా జరిగేవి కావని, సంస్కరణ సమాజంలో ఒకేసారి రావాలని జ్యోతిరావు పూలే ఆశించారు. అందుకే కుల సంస్కరణతో పాటు స్త్రీ పురుష అసమానతలు కూడా పోవాలని ఆశించారు. అందులో భాగంగానే సావిత్రీబాయిని చదివించి టీచర్ ఉద్యోగం చేయమన్నారు. ఆ ఉద్యోగంలో సావిత్రీబాయి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా భర్తకు చేదోడు వాదోడుగా ఉంటూనే వచ్చారు. పూలేని చంపడానికి కిరాయి రౌడీలు వచ్చినపుడు వారిలో మానసిక పరివర్తన కలిగేలా వీరిద్దరూ ప్రవర్తించిన తీరు ప్రశంసనీయం. అలాగే తాము చేపట్టిన సంస్కరణలు వ్యక్తులకు పరిమితం కాకూడదని శక్తులుగా రూపొందాలని వీరిద్దరూ కాంక్షించారు. అందుకే కొన్ని సంఘాలు ఏర్పాటు చేశారు. సమాజ సేవలోనే జీవితమంతా గడిపారు. పూలే మరణం తర్వాత కూడా సావిత్రీబాయి సమాజ సేవలోనే కాలం గడిపారు. 1897 లో పూనాలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు వారికి సేవచేస్తూ సావిత్రీ బాయి కూడా తనువు చాలించారు. "నేను పనిలో ఉండగా మృత్యువు నన్ను వరించడం చాలా అదృష్టం"అని అంటారామె. సావిత్రీబాయి పూలే జీవిత చరిత్రను సంపూర్ణంగా తెలుసుకోవాలంటే ఓల్గా అనువాదాన్ని పూర్తిగా చదవాలి.

# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు పద్య రత్నాలు పాఠ్యాంశ కీలక భావన

10 శతక పద్యాల సమాహారమే పద్య రత్నాలు పాఠం. నైతిక విలువలను పెంపొందింపచేయడం ఈ పాఠం ఉద్దేశం.

ప్రాచీన సాహిత్యంలో పద్యానికున్న విలువ వెలకట్టలేం. అటువంటి పద్యాలలో రత్నాల వంటి 10 పద్యాలను విద్యార్థులు కంఠస్థం చేయాలి అనే ఉద్దేశంతో ఈ పాఠాన్ని పెట్టారు.

ప్రలోభాలకు లొంగిపోయి దుష్టుల దగ్గరికి చేరకూడదు. భక్తులు స్థితప్రజ్ఞులుగా ఉంటారు. నిజమైన భక్తుడు నిత్య జీవితాన్ని క్రమశిక్షణతో గడుపుతాడు. పిసినారి వాడు ఎప్పుడూ రాజు కాలేడు. లోకంలో ఎవరితోనైనా జగడం పెట్టుకోవచ్చు కానీ కవులతో పెట్టుకోకూడదు. మానసికంగా భక్తి లేకుండా భౌతికంగా ఎన్ని పనులు చేసినా అవన్నీ వ్యర్థమే వంటి నీతులను బోధించే పద్యాలు ఈ పాఠంలో ఉన్నాయి.

రంగదరాతిభంగ ఖగరాజ తురంగ వంటి పద్యాలు శబ్ద సౌందర్యంతో శోభిల్లుతున్నాయి. నువ్వు ఎన్ని రోజులు జీవితాన్ని కొనసాగించావు అన్నది ముఖ్యం కాదు. ఎంత ఫలవంతమైనది నీ జీవితం అన్నదే ముఖ్యం. ఇటువంటి నీతులు ఈ పాఠం నిండా చాలా ఉన్నాయి. ప్రస్తుత కాలంలో గురువులంటే గౌరవం లేకుండా పోతోంది. అందుకే ఆచార్యున కెదిరింపకు వంటి కుమార శతకంలోని పద్యాలను కూడా పెట్టారు. శతక ప్రక్రియను పరిచయం చేయడం కూడా పాఠంలోని ప్రధాన ఉద్దేశాలలో ఒకటి.

# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు ప్రబోధం పాఠ్యాంశ కీలక భావన

తెలుగులో ఒకప్పుడు లేఖా సాహిత్యం విస్తృతంగా ఉండేది. భావ వినిమయానికి చైతన్య పరిధి పెరగడానికి లేఖా సాహిత్యం బాగా ఉపయోగపడింది. కనుపర్తి వరలక్ష్మమ్మగారు శారద లేఖలు పేరుతో స్త్రీల చైతన్యం పెరగడానికి రచనలు చేశారు. వాటిలో ఒక లేఖను విద్యార్థులకు పరిచయం చేయడం ఈ పాఠం ఉద్దేశం. కవయిత్రిగా దేశ వ్యాప్తంగా కీర్తి పొందిన సరోజినీ దేవి గారి ఉపన్యాసాన్ని లేఖరూపంలో అందించారు కనుపర్తి వరలక్ష్మమ్మ గారు.

1928లో వరలక్ష్మమ్మ గారు వ్రాసిన లేఖలోని కొన్ని అంశాలు నేటికి పరిష్కారం కాని అంశాలుగానే మిగిలి పోయాయి. బాల బాలికలకు సంపూర్ణ విద్య అనే అంశం నేటికి100% విజయం పొందకపోవడం గమనార్హం. చట్టసభల్లో స్త్రీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి అనే అంశం కూడా ఇందులో ప్రస్తావితమై ఉంది. స్త్రీలు తమ హక్కుల గురించి కొత్తగా మాట్లాడటం లేదని, అది ఎప్పడో ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభం నుండే మొదలైందని ఈ పాఠం చెప్తుంది. పోరాటాల రూపాలు, అంశాలు మారాయేమో కాని, పోరాటం మాత్రం ఎప్పటినుంచో కొనసాగుతూనే ఉంది అని అవగాహన విద్యార్థులకు ఈ పాఠం వల్ల కలుగుతుంది. స్త్రీలలో ఆత్మ విశ్వాసం నింపడానికి పురాణ పాత్రలైన సీత, సావిత్రి మొదలైన వారిని ప్రస్తావించడం దీంట్లో కనిపిస్తుంది. అలాగే అంతరార్థం తెలియకుండా చేసే తీర్థయాత్రలు నిష్ఫలమని చెప్పడం కీలకమైన అంశం. మాతృమూర్తి అయిన స్త్రీ సహజమైన తన ప్రేమను బిడ్డలకు మాత్రమే పరిమితం చేయకుండా ఆ ప్రేమ పరిధిని విస్తరింప చేయాలని చెప్పడం నవ్య భావన ప్రేమతో ఉండటమే నిజమైన సౌందర్యము అన్న ఉపదేశం ఈ పాఠంలో ఉంది.

ఆత్మస్తుతి, పరనింద ఈ రెండు పనికిరావని పెద్దలంటూ ఉంటారు. అలానే ఆత్మనింద కుడా పనికిరాదు. కానీ కొన్ని సందర్భాలలో పరస్తుతి అవసరం. ఎదుటివారిలో ఉన్న ఏ కొంచెం మంచినైనా గుర్తించి చెప్పటం ఒక మంచిలక్షణం. ఈ లక్షణాన్ని పెంపొందించడం కోసమే ప్రశంస అని అభ్యాసాన్ని పాఠ్య పుస్తకాల్లో పొందుపరిచాం. దానికి లక్ష్యప్రాయంగా ఉండే ఉపవాచక పాఠం నేనెరిగిన బూర్గుల.

ప్రశంస అంటే సాధారణంగా ఒక తప్పు అభిప్రాయం ఉంది. ఎదుటి వ్యక్తిలో లేని గుణాన్ని కూడా ఆపాదించి చెప్పడమే ప్రశంస అనుకుంటారు. అది వాస్తవం కాదు. ఉన్న గుణాన్ని ఉన్నట్లు చెప్పడం ప్రశంసలో భాగమే. ఈ పాఠం వ్రాసిన పి.వీ. నరసింహరావుగారు పాఠంలో ఉన్న బూర్గుల రామకృష్ణారావు గారు ఇద్దరూ ఉన్నత వ్యక్తులే. నిరాడంబరులే. వ్యక్తి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించేది కాల క్రమ పద్ధతిలో చెప్పిన అతని జీవిత వివరాలు కాదని, అతని జీవితంలో జరిగిన కొన్ని ప్రధాన అంశాల వివరణ అతని వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని ఈ పాఠంలో పి. వి.నరసింహరావుగారు చెప్పారు. తనలో ఉన్న లోపాలపై తానే హాస్యమాడగలిగిన గొప్ప వ్యక్తిత్వం బూర్గుల రామకృష్ణా రావు గారిది.

తన పొట్టితనం గురించి తానే ఎన్నో సందర్భాల్లో ఆయన హాస్యంగా మాట్లాడేవారు. కానీ అవసరం వచ్చినపుడు విరాట్ రూపం చూపించడం కూడా వారికి తెలుసు. న్యాయవాద వృత్తి స్వీకరించి రాజకీయాలకు సంబంధించిన కేసులను స్వీకరించారు. చాలామందికి ఉచితంగా కేసులు వాదించేవారు. స్నేహ విషయాల్లో వారు తరతమ భేదాలను గాని చిన్న పెద్ద తేడాను గాని పాటించేవారు కాదు. అందువలననే పి.వి. నరసింహరావు గారికి బాగా చనువునిచ్చి సమానస్థాయినిచ్చి గౌరవించారు. జాగీర్దారీ కుటుంబంలో పుట్టి కౌలుదారీ చట్టానికి మద్దతునిచ్చి తన నిజాయితీని నిరూపించుకున్నారు. తన ఉనికికి భంగం కలుగుతుందని తెలిసినా కూడా హైదరాబాద్ సంస్థానం విచ్ఛిత్తికి సహకరించారు. సైద్ధాంతికంగా ఎంత విభేదించినా వ్యక్తిగతంగా అందరితో అరమరికలు లేకుండా ఉండేవారు. వారి ఇంటికి వచ్చే ఎంతో మంది ముస్లిం వ్యక్తులే దీనికి ఉదాహరణ. అలాగే రామకృష్ణారావుగారు బహు భాషావేత్త, ఉపకారశీలి కూడా. ఇవి వారిలో ఉన్న సద్గుణ రాశిలో కొన్ని అంశాలు మాత్రమే. ఈ వ్యాసం ఎదుటివారిలో మంచితనాన్ని గుర్తించి గౌరవించడానికి ఉద్దేశించినది.

15 వ శతాబ్దానికి చెందిన అనంతామాత్యుడు రచించిన భోజరాజకీయం కథ కావ్య ప్రక్రియలో ఎంతోప్రాచుర్యం పొందింది. ఈ గ్రంథంలోని ఆవు పులి కథ అనాదిగా పఠన పాఠనాదులలో ఉంటూనే ఉంది. సత్య వాక్కుకున్న మహిమను రమణీయంగా చెప్పిన కథ ఇది. ప్రాణాంతకమైన పరిస్థితులలో కూడా ఆడినమాట తప్పకపోతే అదే నిన్ను కాపాడుతుంది అన్న సందేశం ఈ కథలో ముఖ్యం.

అలాగే సత్యవాక్కు ఎంతటి క్రూరమైన మనసున్న వారినైనా సన్మార్గానికి మారుస్తుందని కథ నిరూపిస్తుంది. పుత్ర వాత్సల్యం కన్నా ఆడినమాట తప్పకపోవడమే ముఖ్యం అని ఈ కథ బోధిస్తుంది. ఒకే కథలో భిన్న భిన్న విలువలను ప్రతిపాదించి వాటిమధ్య ఘర్షణ కల్పించి పాలనుంచి నవనీతం తీసినట్లు ఉత్తమ ధర్మాన్ని ప్రతిపాదించడం ఈ కథలో విశిష్టత. ఒక ప్రక్క అప్పుడే పుట్టిన కొడుకు మరోపక్క తన మాటపై విశ్వాసముంచి ఇంటికి పంపిన క్రూరమృగమైన పులి. ఈ రెండింటి మధ్య ఘర్షణ అనుభవించిన ఆవు చివరకు పుత్రవాత్సల్యాన్ని జయించి ధర్మం వైపే మొగ్గు చూపుతుంది. అదే ఆ ఆవుకు శ్రీరామ రక్షగా నిలుస్తుంది. ఎప్పటికైనా ధర్మమే జయిస్తుంది అని నిరూపిస్తుంది ఈ కథ. సందర్భోచితంగా కథలో చెప్పిన నీతులు సంప్రదాయంలో భాగమైపోయి తరతరాలుగా వస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు చులుకున జలరుహ తంతువు అనే పద్యం తల్లిలేని పిల్లల దౌర్భాగ్య స్థితిని కళ్ళకు కడుతుంది. ఆవు సత్య బుద్ధికి పులి కరుణార్ద్ర దృష్టికి సంతసించి దేవతలు కూడా ప్రసన్నులయ్యారు అని చెప్పడం కథకు పరాకాష్ట. ధర్మబద్ధమైన జీవితం దేవతలను కూడా ప్రసన్నులను చేస్తుంది అని బోధిస్తుంది ఈ పాఠం.

ఆధునిక తత్వవేత్తలలో జిడ్డు కృష్ణమూర్తిగారికి విశిష్టమైన స్థానం ఉంది. అనాదిగా వస్తున్న భావనలను పటాపంచలు చేసి కొత్త ఆలోచనా దృక్పధాన్ని ప్రజలకు కలిగించడానికి ప్రయత్నించారాయన. పూర్వపు ఆలోచనా ధోరణి, ఆలోచనా పరంపర, అన్నీ వదిలేసి ఏ విషయం గురించి అయినా నీ అంతట నువ్వే ఆలోచించి అభిప్రాయం ఏర్పరుచుకో! ఇదీ ఆయన చెప్పిన ప్రధాన విషయం.

వినడం, మాట్లాడడం, చూడడం, పరిశీలించడం, శ్రద్ధచూపడం వంటి విషయాలను సచేతనంగా చేస్తే సత్ఫలితాలు వస్తాయని ఈ పాఠంలో చెప్పారు. మానవుడు తనకున్న ఇంద్రియాలను సరిగా వాడుకుంటే అద్భుతమైన ఫలితాలను అనంతమైన ఆనందాన్ని పొందవచ్చని చెప్పడం ఈ పాఠం లోని కీలక అంశం.

అలాగే మీలాగ మీరు బతకండి, మీకు ఎవరితోనూ పోలిక, పోటీ వద్దు అని చెప్తుంది ఈ పాఠం. ఎవరో చెప్పినది విని, దానికి అనుగుణంగా నడుచుకోవటం మీకు అలవాటైపోయింది, దానినుండి బయట పడండి అని అంటారు కృష్ణ మూర్తి గారు. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు ఉన్న నైర్మల్యం ఊహాశక్తి పెరిగి పెద్దదవుతున్న కొద్దీ మనుషులలో అంతరించి పోతున్నాయి. దీనికి కారణం సాదా సీదా జీవితానికి అలవాటు పడి పోవడమే. దాన్నుంచి బయట పడండి అంటారు కృష్ణమూర్తి గారు. ఒక క్రమ పద్ధతి ప్రకారం సమన్వయ పూర్వకంగా పరిశీలించడం అలవాటు చేసుకుంటే ఎన్నో కొత్త విషయాలు అవగాహనకు వస్తాయంటారాయన. ఇలా కొన్ని మౌలిక విషయాలపై విద్యార్థులకు కొత్త చూపు ప్రసాదించేలా ఉంటుంది ఈ పాఠం.

సమాజానికి ఏది అవసరమో ముందుగానే గ్రహించి ప్రజలందరికీ పరిచయం చేసేవాళ్ళను వైతాళికులు అంటారు. అలాంటి వైతాళికులలో గిడిగు వేంకట రామమూర్తి గారు ముఖ్యులు. భాషా విషయంలో మన రాష్ట్రంలో ముఖ్యంగా రెండు వాదాలు ఉన్నాయి. గ్రాంథిక వాదము, వ్యావహారిక వాదము. గ్రంథాలలో ఉన్న భాష అంటే కావ్యాలలో ఉన్న భాష ఎలా ఉంటుందో అలానే నిత్య వ్యవహారంలో ఉండే భాష కూడా ఉండాలి అని వాదించడం గ్రాంథిక వాదంలో ఉన్న ప్రధాన విషయం. సంధులు కలిపి వ్రాయడం, శకటరేపం వాడటం, అరసున్నాలు వాడడం, మొదలైన నియమాలను ఖచ్చితంగా వాడటం గ్రాంధికల వాదంలో ఉన్న ప్రధాన విషయం.

వ్యావహారిక వాదం దీనికన్నా భిన్నమైనది. మనుషులు ఒకరితో ఒకరు మాట్లాడుకునేటప్పుడు ఎటువంటి భాష వాడతారో, అటువంటి భాషని సాధారణ రాతకోతలకు ఉపయోగించడం. గ్రంధాలలో కూడా ఇటువంటి భాష వాడటం మంచిదని వ్యావహారిక వాదులు చెబుతారు. ఈ వాదానికి ఆద్యుడు గిడుగు వేంకట రామమూర్తి పంతులు గారు. మొదట ఈ వాదాన్ని ఆయన ప్రవేశపెట్టినపుడు చాలామంది ఆయనను వ్యతిరేకించారు. ఆయన స్నేహితుడు గురజాడ వేంకట అప్పారావు మాత్రం మద్దతునిచ్చి తన రచనలను అన్నింటినీ వ్యావహారిక భాషలోనే వ్రాసి దానికి ప్రచారం కల్పించారు. వ్యావహారిక భాషలో వ్రాస్తేనే అందరికీ అర్థమవుతుందని గురజాడ, గిడుగు బాగా విశ్వసించారు. అందుకే దానికి ప్రచారం కల్పించారు. ఈ క్రమంలో వారు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అవన్నీ అధిగమించి ప్రజలకు పనికివచ్చే వ్యావహారిక భాషను ప్రచారంలోకి తీసుకొచ్చారు. మెమోరాండం ఆన్ మోడ్రన్ తెలుగు అనే ఆంగ్ల రచనలో ఆయన భావాలను ప్రకటించారు. అట్లానే సవరలు అనే జాతి వారికి సంబంధించిన భాషకు వ్యాకరణం వ్రాయడం, నిఘంటువులు తయారు చేయడం వారు చేసిన ముఖ్యమైన పని. కానీ వారు గ్రాంథిక భాషను పూర్తిగా వ్యతిరేకించారు అనడం సరికాదు. నేను గ్రాంథిక భాషకు వ్యతిరేకిని కాదు, తెలుగుభాషలో పాండిత్యం సంపాదించాలన్న, భాషా స్వరూపం తెలుసుకోవాలన్న, గ్రాంథిక భాషను తప్పకుండా అభ్యసించాలి. తెలుగు భాషకు ప్రాణవాయువు వంటిది సంస్కృతం. దాన్ని కూడా అభ్యసించటం అవసరం. ప్రజలకు ఉపయోగపడే గ్రంథాలను కృతక భాషలో వ్రాసి భేషజాన్ని ప్రదర్శించవద్దని మాత్రమే నేను చెబుతాను అని ఆయన అన్నారు. దీన్ని బట్టి గిడుగువారి భాషా దృక్పథం ఏమిటో తేటతెల్లమవుతోంది.

# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు భూమి పుత్రుడు పాఠ్యాంశ కీలక భావన

భావ కవితాయుగంలో ప్రముఖ కవిగా పేరొందిన కవికోకిల దువ్వూరి రామిరెడ్డి గారు కృషీవలుడు అనే కావ్యం వ్రాశారు. ప్రాక్ పశ్చిమ దృక్పథాలను బాగా అవగాహన చేసుకున్న వారు కాబట్టి రైతు పడే కష్టాలను కృషీవలుడు కావ్యంలో కళ్ళకు కట్టినట్లు చూపించారు. ఆ కావ్యంలోని కొన్ని పద్యాలు భూమి పుత్రుడు పాఠంగా రూపొందాయి.

శ్రమ విలువను విద్యార్థులకు తెలియజేయడం, వస్తూత్పత్తి ఎలా జరుగుతుందో అవగాహన చేయించడం ఈ పాఠం ఉద్దేశం. శ్రమశక్తిని గౌరవించాలి అనే సందేశం కూడా ఈ పాఠంలో ఉంది. సమాజంలో కబుర్లుచెప్పి కాలం గడిపేవాడు ఎక్కువ కానీ రైతు మాత్రం తన శ్రమను నమ్ముకొని జీవిస్తుంటాడు అందుకనే రాజుగారి పాలన దండం కన్నా రైతు చేతిలోని నాగలి గొప్పదని కవి అంటున్నాడు.

రోజంతా చాకిరీ చేసిన రైతు ఆశించేది తన నిత్యావసరాలు తీరితే చాలు అని మాత్రమే. పని పాట లేని వారే ఈర్ష్యాసూయలకు లోనవుతారు. ప్రక్కవారిని చూసి ఈర్ష్యపడే అంత సమయం రైతుకు లేదు. అందుకే అతని హృదయం నిర్మలంగా ఉంటుంది. తనకు ఉన్నంతలో పక్కవారికి పెట్టడం రైతు నైజం. అందువల్ల మనం రైతు దగ్గరనుంచి నేర్చుకోవలసింది చాలా ఉంది అని ఈ పాఠం చెబుతుంది.

వ్యవసాయం తద్వారా వాణిజ్యం దానివల్ల ధనం, ఇదీ వరస. అంటే అన్నిటికీ మూలం వ్యవసాయమే. వ్యవసాయం చేసే రైతు అందరికీ మూలం. కానీ రైతును గుర్తుపెట్టుకునే వారెవరు? అని ప్రశ్నించడం ద్వారా మన ఇంట్లో ధాన్య వర్షాన్ని కురిపించే రైతును మనం గుర్తు పెట్టుకోవాలని కవి చెబుతున్నాడు. ఎవరు గుర్తించినా గుర్తించక పోయినా రైతు చాలా గొప్పవాడని ఆయన జీవితం ఆత్మవిశ్వాసంతో కొనసాగాలని రచయిత ఆశిస్తున్నారు.

అన్నదాత గురించి విద్యార్థులు ఆలోచించేలా చేయడం ఈ పాఠం ఉద్దేశం. తాను తినే బియ్యం ఎక్కడనుండి వస్తున్నాయో నేటి పిల్లవాడికి తెలియటంలేదు. తాను తాగే పాలు ఎక్కడనుండి వస్తున్నాయో కూడా తెలియని స్థితిలో ఉన్న విద్యార్థులకు మౌలికమైన అవగాహన కల్పించడానికి ఈ పాఠం దోహదపడుతుంది.

# అక్షరార్చన.కామ్ 9 వ తరగతి తెలుగు  బతుకు పుస్తకం పాఠ్యాంశ కీలక భావన

ఒక పుస్తకాన్ని ఎలా చదవాలి, ఎలా సమీక్షించాలి అనే విషయాన్ని చెప్పడంకోసం బతుకు పుస్తకం అనే పాఠాన్ని పెట్టారు. పుస్తకాన్ని సమీక్షించడంలో సమీక్షకుల వ్యక్తిగత అభిరుచులు ప్రతిఫలించినా, వాటికి కొన్ని మౌలిక నియమాలు ఉన్నాయి. వాటికి సంబంధించిన అవగాహన కల్పించడం ఈ పాఠం ఉద్దేశం.

బతుకు పుస్తకం అనే పుస్తకాన్ని ఉప్పల లక్ష్మణరావు గారు వ్రాశారు. ఈ పుస్తకాన్ని సమీక్షించింది రచయిత్రి సావిత్రి. పుస్తకాన్ని సమీక్షిస్తూ ఒక గ్రంథం పఠితకు ఏమివ్వాలి ? అని ఆమె ప్రశ్నించుకున్నారు. సమాధానం, ఉత్సాహం, బాధ్యత, విజ్ఞానం వంటి లక్షణాలను పఠితలో కలిగించాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక పుస్తకం కార్యశీలత రేపాలి, కదపాలి, కుదపాలి, మంచి దారి చూపాలి, మనశ్శాంతి కలిగించాలి అని సావిత్రి అంటారు.

బతుకు పుస్తకం ఆత్మ కథ కాబట్టి లక్ష్మణరావుగారి జీవితంలోని అనేక అంశాలు ఇందులో కనిపిస్తాయి. వారు మెల్లి అనే మహిళను ఎందుకు వివాహం చేసుకున్నారో ఇందులో వివరించారు. లక్ష్మణరావుగారే వ్రాసిన 'అతడు - ఆమె' అనే గ్రంథానికి సంబంధించిన వివరాలు కూడా ఈ పుస్తకంలోనే కనిపిస్తాయి. ఎందుకంటే ఇది ఆత్మ కథ కదా. బతుకు పుస్తకం ఈ శతాబ్దపు మన దేశ చరిత్రకు అద్దం పట్టే పుస్తకం అని రచయిత్రి అభిప్రాయపడ్డారు. ఏదైమైనా పుస్తకాలను సమీక్షించడంలో ఉన్న అనేక కోణాలలో ఒక కోణాన్ని ఇందులో మనం చూడవచ్చు. పుస్తక సమీక్ష కేవలం ఉపరితల అంశాలను మాత్రమే స్పృశించడం కాదని పుస్తకం లోలోపలికి వెళ్ళి రచయిత హృదయాన్ని కూడా ఆవిష్కరిస్తుందని దీని ద్వారా మనం తెలుసుకోవచ్చు.

# 9 వ తరగతి తెలుగు - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి పాఠ్యాంశ కీలక భావన

జనని సంస్కృతంబు సకల భాషలకును అని భాషావేత్తలు నమ్ముతున్న దశలో ఆ నమ్మకాలను వమ్ముచేస్తూ భాషాశాస్త్ర రంగంలో విప్లవాత్మక ప్రతిపాదనలను చేసిన వారు ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు. తెలుగు సంస్కృత భాషనుంచి పుట్ట లేదని సశాస్త్రీయంగా నిరూపించిన వారిలో వారొకరు. తెలుగు భాషా శాస్త్రరంగంలో పితామహుడిగా వీరు పేరొందారు. వీరి శిష్యులైన చేకూరి రామారావు గారు, ఆచార్య కే.కే. రంగనాధాచార్యులు గారు, డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ గారు, డాక్టర్ ఉమా మహేశ్వరరావు గారు, డాక్టర్ పరిమి రామనరసింహం గారు భిన్న రంగాలలో కృషి చేసి భాషపై ఆధునిక అవగాహనకు తోడ్పడ్డారు. మాండిలిక వృత్తిపదకోశాల రూపకల్పన ఒక నవ్య భావన. అది భద్రిరాజు కృష్ణమూర్తి గారి ఆలోచన నుండి పుట్టినది. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన కృష్ణమూర్తిగారు 30 కి పైగా గ్రంథాలు రచించారు. తెలుగు వెర్బల్ బేసిన్ అన్న సిద్ధాంత గ్రంథం వీరికి ఎనలేని పేరు తెచ్చిపెట్టింది. తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది అని చెప్పడమే కాకుండా మధ్య ద్రావిడ భాషా కుటుంబంలో తెలుగుకున్న స్థానాన్ని గురించి వీరు చేసిన పరిశోధన చాలా లోతైనది. భాషోత్పత్తి, లిపి, భాష పరిణామక్రమం మొదలైన అనేక అంశాలపై విస్తృత పరిశోధనలు చేసిన భద్రిరాజుగారు విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలోనే చేశారు. తెలుగు భాషకు ప్రాచీనతను నిరూపించడం, ఆధునికులు ఉపయోగించే భాషా మూలాలు గిరిజనుల్లో ఉన్నాయని చూపడం, మాండలిక పదాల వల్లే భాష సజీవంగా ఉంటుందని చెప్పడం వంటి ఎన్నో విలువైన అంశాలను తెలుగు జాతికి అందించారు భద్రిరాజుగారు. 2012 లో వారు కీర్తిశేషులైనా వారి పేరుమాత్రం భాషాశాస్త్ర తరగతి గదుల్లో నిత్యం మార్మోగుతూనే ఉంటుంది.

# ధర్మ దీక్ష పాఠ్యాంశ కీలక భావన

పిలకా గణపతి శాస్త్రిగారు వ్రాసిన ప్రాచీన గాధాలహరిలో ఒక కథ ధర్మదీక్ష. కథలు చదవడం ద్వారా పిల్లలలో సున్నిత భావనలు పెంపొందించడం, జీవకారుణ్య దృష్టి కలిగించడం ఈ పాఠం ఉద్దేశం.

పైకి ప్రకటించినా ప్రకటించకపోయనా ప్రతి మనిషి ఏదో ఒక విషయంలో అంతర్గత ఘర్షణ అనుభవిస్తూనే ఉంటాడు. నీతికి, అవినీతికి మధ్య ఘర్షణ, మంచికి చెడుకు మధ్య ఘర్షణ, కర్తవ్యా కర్తవ్యాల పట్ల ఘర్షణ ఇటువంటి ఘర్షణలో మనిషి ఎటువైపు నిలబడతాడు అన్నది ముఖ్యం.

ఈ కథలో ఉపదేశము, కర్తవ్యము అన్న రెండు అంశాలమధ్య ఒక మనిషిలో ఘర్షణ జరుగుతుంది. నందగోపుడు అనే వ్యక్తి ఇంట్లో ఉన్న ఆవు అడవిలో తప్పిపోతుంది. దానిని వెతకటానికి నందగోపుడు బయలుదేరుతాడు. ఆరోజే జగద్గురువుగా పేరుపొందిన బుద్ధుడు ప్రజలకు సందేశం ఇవ్వడానికి నందగోపుని గ్రామమైన ఆళవికి వస్తున్నట్లు తెలుస్తుంది. బుద్ధుడి ప్రవచనాలను ప్రత్యక్షంగా వినడం ఒక అరుదైన అవకాశం. దీనిని పోగొట్టుకుంటే జీవితంలో మరి ఎప్పుడు అతను బుద్ధుడి బోధనలను ప్రత్యక్షంగా వినలేడు. అలా అని అడవిలో దారితప్పి అల్లాడుతున్న ఆవును వెతకటానికి వెళ్ళకుండా ఉండనూ లేడు. మనసులో ఈ ఘర్షణ కొద్దిసేపు అనుభవించిన తర్వాత నందగోపుడు అడవిలోనికి వెళ్ళడానికి మాత్రమే నిశ్చయించుకుంటాడు. వెళ్ళిపోతాడు కూడా. ఇక్కడ కథలో ఒక మలుపు ఉంది. నందగోపుడు ఆవును వెతుక్కొని తన గ్రామానికి వచ్చేవరకు బుద్ధుడు ఏ ప్రవచనము చెప్పకుండా మౌనంగా ఎవరికోసమో ఎదురు చూస్తుంటాడు. శిష్యులకు, ప్రజలకు బుద్ధుడి మౌనం వెనుక ఉన్న అంతరార్థం తెలియక కొట్టుమిట్టాడు తుంటారు. ఆవును వెతుక్కొని నందగోపుడు ఊరికి వస్తాడు. అప్పటికి మధ్యాహ్నం వేళ దాటిపోతుంది. రాగానే బుద్ధుడే స్వయంగా అన్నం పెట్టి ఆదరించి కుశల ప్రశ్నలు వేసి అందరినీ ఆశ్చర్యపరుస్తాడు. ఆ తర్వాత ఉపదేశం ఇస్తాడు. ఉపదేశంలో ఉన్న ముఖ్యమైన విషయం ఏమిటంటే ప్రవచనం వినటం కన్నా కర్తవ్యం ఆచరించడమే మిన్న అని. ఆవు ఆకలిని నందగోపుడు గమనించాడు. అతని ఆకలిని నేను గమనించాను. క్షుధార్తులైన వారిని ఆదరించడం కన్నా మించిన ధర్మం లేదు అంటాడు బుద్ధుడు. ఇలా జీవకారుణ్య దృష్టిని ఆర్ధతతో చిత్రించిన కథ ఇది.

# అక్షరార్చన .కామ్ 9 వ తరగతి తెలుగు ధృవతారలు పాఠ్యాంశ కీలక భావన

నక్షత్ర మండలంలో ధ్రువ నక్షత్రం ఎలా ప్రకాశిస్తూ కనిపిస్తుందో సమాజంలోనూ కొంతమంది వ్యక్తులు ప్రకాశిస్తూ కనిపిస్తారు. వారు ఒక్కో రంగంలో ఒక్కో ప్రఖ్యాతి వహించి ఉంటారు. అలాంటి వారిలో కొందరి గురించి తెలియజేయడం ఈ పాఠం ఉద్దేశం.

## డాక్టర్ నోరి దత్తాత్రేయుడు:-

నోరి దత్తాత్రేయుడు ప్రసిద్ధ క్యాన్సర్ వైద్య నిపుణుడు. కృష్ణాజిల్లా మంటాడ గ్రామంలో సాధారణ కుటుంబంలో పుట్టిన దత్తాత్రేయుడు అసాధారణ వ్యక్తిగా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందడానికి దీక్షా దక్షతలు మాత్రమే కారణం. సరైన వైద్యం లేక తండ్రి మరణించాడని తల్లి చెప్పే మాటలు అతని హృదయంలో నాటుకున్నాయి. అలాంటి అసౌకర్యం మరొకరికి కలుగకూడదని వైద్య వృత్తిని ఎంపిక చేసుకున్నారు. ఆ రంగంలో శిఖరాలను అధిరోహించారు. ఈ శిఖరారోహణలో దత్తాత్రేయుడు గారు ఎన్నో వైఫల్యాలు ఎదుర్కొన్నారు. అయినా ఎక్కడా నిరాశ చెందలేదు. ఇది మనం ఆయన దగ్గర్నుంచి నేర్చుకోవాల్సిన ప్రధాన అంశం. ప్రసిద్ధ వ్యక్తులలాగా ఎదగాలని ప్రతి మనిషికి ఉంటుంది. అయితే ఆ ప్రసిద్ధుల జీవితాల్లోనికి తొంగిచూసినపుడు మాత్రమే ఆ స్థితికి చేరుకోవడానికి వారు పడ్డ కష్టాలు తెలుస్తాయి. వైఫల్యాలను లెక్కచేయకుండా నిరంతరం కృషి చేయడం వల్ల బ్రోకి థెరఫీ వంటి కొత్త విధానాలు వైద్యంలో ప్రవేశపెట్ట గలిగారు. అంతేకాదు జన్మభూమి రుణం తీర్చుకోవడానికి కంకణం కట్టుకున్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తన లక్ష్యమని ప్రకటించారు. నవ్యాంధ్రలో రాష్ట్రస్థాయి క్యాన్సర్ హాస్పిటల్ ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నారు. మన పని మనం చేసుకుంటూ పోతే కీర్తి దానంతట అదే వస్తుంది అనడానికి తార్కాణం దత్తాత్రేయుడు గారికి 2015లో వచ్చిన పద్మశ్రీ బిరుదు. జీవితం కరిగిపోయే మంచు, ఉన్నంతలో పదిమందికి పంచు అన్న వాక్యానికి ఉదాహరణ దత్తాత్రేయుడు గారి జీవితం . మనందరికీ ఆదర్శవంతం.

## సర్దేశాయి తిరుమలరావు:-

సాధారణంగా సైన్సు చదువుకున్నవారు సాహిత్యాన్ని, సాహిత్యాన్ని చదువుకున్నవారు సైన్సును అభిమానించడం, అభినివేశం కలిగి ఉండడం మనం చూడం. ఈ అరుదైన కలయిక సర్దేశాయి తిరుమలరావు గారిలో  సంపూర్ణంగా కనిపిస్తుంది. ఛత్రపతి శివాజీ పుట్టిన రోజునే తాను జన్మించి మరాఠా ప్రాంతం నుంచి వచ్చి కర్నూలు జిల్లాలో స్థిరపడ్డ సర్దేశాయి తిరుమలరావు గారు తైల విజ్ఞాన ప్రపంచంలో ప్రసిద్ధులు. అవసరం నుంచి అన్వేషణ మొదలవుతుంది అంటారాయన. చాలామంది పరిశోధనలు ఏకముఖంగా చేస్తుంటారు. తిరుమలరావు గారు బహుముఖాలుగా పరిశోధన చేయడంలో దిట్ట.  నూనెపై పరిశోధనలు అనేది వారి రంగమైనా దాంట్లో పలు పోకడలు పోయారు. బియ్యపు పొట్టునుండి రోసా గడ్డివరకు ఎన్నో అంశాలపై పరిశోధన చేశారు. బియ్యపు తౌడు నుండి నూనె తీయవచ్చు అని కనుగొన్నది ఆయనే. కేవలం దీనిపైనే ఆయన 60కి పైగా పరిశోధన పత్రాలు సమర్పించారు. దీనిని బట్టి ఆయన కృషిని ఊహించవచ్చు. మనందరం వాడి పడేసిన కాఫీపొడి నుండి కూడా నూనె తీయవచ్చు అని నిరూపించారాయన. గొప్ప గొప్ప శాస్త్రవేత్తలతో ఎంత బాగా మాట్లాడేవారో  మారు మూల రైతుతో అంతే చనువుగా మాట్లాడడం ఆయనకున్న ప్రత్యేకత. పత్రికలకు ఉత్తరాలు వ్రాయడంలో కూడా ఎంతో ఆసక్తి చూపేవారు. సాహిత్య పరిశోధకుడిగా పేరు పొందారు. సాహిత్య తత్వం శివ భారత దర్శనం, కన్యాశుల్కం నాటక కళ అని పుస్తకాలు వ్రాశారు. సైన్స్‌కి సాహిత్యానికి ఉండే సంబంధాన్ని చక్కగా చెప్పారు. గొప్ప గొప్ప పనులు చేయాడనికి మనిషి ఒంటరిగానే ప్రయాణం చేయాలి అని చెప్పి ఆయన 1994 న దేహత్యాగం చేసిన ప్రాతఃస్మరణీయులలో ఒకరిగా నిలిచిపోయారు.